క్లుప్తంగా

డాట్స్ చికిత్సతో క్షయ నుంచి విముక్తి



మధురానగర్(విజయవాడసెంట్రల్): డాట్స్ చికిత్సతో క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేయొచ్చని టీబీ ఎస్టీఎస్ బి.ఉషారాణి సూచించారు. క్షయపై అవగాహన పెంపొందించుకుని, వ్యాధి లక్షణాలు ఏ మాత్రం కనిపించినా సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని పేర్కొన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా సోమవారం నవజీవన్ బాలభవన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ.. రెండు వారాల పాటు దగ్గు, జ్వరం రావడం, రాత్రి వేళల్లో చమటలు పట్టడం, కళ్లిలో రక్తం పడటం, ఛాతీలో నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, అలసట, మెడ మీద గడ్డలు ఉండడం క్షయ వ్యాధి లక్షణాలని వివరించారు. ఈ లక్షణాలు కనిపిస్తే పాత ప్రభుత్వాస్పత్రిలోని టీబీ కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఎస్ నాగేశ్వరరావు, టీబీ హెచ్‌వీ ఇందిర తదితరులు పాల్గొన్నారు

ముగిసిన సద్గురువుల ఆరాధనా సంగీతోత్సవాలు



విజయవాడ కల్చరల్: సంగీత సద్గురువులు సుసర్ల దక్షిణామూర్తిశాస్త్రి 108, గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 74వ వర్ధంతి సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలోని భారతీతీర్థ శ్రవణసదనంలో ఐదు రోజులుగా నిర్వహించిన ఆరాధానా సంగీతోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరిరోజు కార్యక్రమంలో శివలెంక విశ్వనాథ్, హేమాద్రి చంద్రకాంత్, గుడిపాటి శ్రీలలిత, సంగీత విద్వాంసురాలు అంజనా సుధాకర్, పారుపల్లి రామకృష్ణ పంతులు శిష్యుడు అన్నవరపు రామస్వామి వయోలిన్ కచేరితో కార్యక్రమాలు ముగిశాయి.

కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలి



విజయవాడ కల్చరల్: సాంస్కృతిక సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు కోరారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, పోలవరపు సాహితీ సమితి, క్రామేడ్ జీఆర్‌కే సంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో సోమవారం జిల్లా కళాకారుల ఆత్మీయ సమావేశం, సినీ సంగీత విభారి జరిగాయి. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు మాట్లాడుతూ.. కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డ్‌లు ఇవ్వాలని కోరారు. వివిధ సంస్థల ప్రతినిధులు బి.వి.వీరభద్రరావు, శ్యాంప్రసాద్ కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళాలన్నారు. గాయనీ గాయకులు సుషీల్‌కుమార్, భారతి, నాగమణి, మోహన కృష్ణ, రమ్‌జాబీ తదితరులు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు.

నేటి నుంచి బ్యాంకుల సాచ్యురేషన్ క్యాంపెయిన్

ఎస్ఎల్‌బీసీ చైర్మన్ భాస్కరరావు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేంద్ర లక్ష్యాల్లో భాగంగా ఏపీలో బ్యాంకులు జూలై ఒకటో తేదీ నుంచి మూడు నెలలు సాచ్యురేషన్ క్యాంపెయిన్‌ను నిర్వహించనున్నట్లు ఏపీ ఎస్ఎల్‌బీసీ చైర్మన్ సీవీఎస్ భాస్కరరావు చెప్పారు. ఈ సందర్భంగా నగరంలోని యూనియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులతో కలిసి సాచ్యురేషన్ క్యాంపెయిన్ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని 13,324 గ్రామ పంచాయతీలన్నిటిలో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి జనధన్ యోజన కింద ఖాతాలు ప్రారంభించడం, ప్రతి ఇంటికి బ్యాంకు ఖాతా ఉండేలా చూడటం, రూపే కార్డు యాక్టివేషన్, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కోసం ఆధార్ సీడింగ్ వంటివి క్యాంపెయిన్‌లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కెనరాబ్యాంక్ జీఎం విజయలక్ష్మి, ఏపీ గ్రామీణ బ్యాంక్ జీఎం జమిలాల్, ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్‌బీఐ ఏజీఎం వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో ఇన్నర్‌రింగ్ రోడ్డు

- సెంట్రల్ లైట్లు వెలగక రాత్రివేళ ఇబ్బందులు
- ప్రమాదాల బారినపడుతున్న ద్విచక్రవాహన చోదకులు
- పెచ్చుమీరిన గంజాయి బ్యాచ్‌ల ఆగడాలు
- హడలిపోతున్న స్థానిక ప్రజలు, వ్యాపారులు



వాహనాల వెలుగులో ఇలా రాకపోకలు సాగించాల్సిందే

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ పైపుల రోడ్డు నుంచి జక్కంపూడి వైఎస్సార్ కాలనీ వైపు ఉన్న ఇన్నర్ రింగ్ రోడ్డు స్థానిక ప్రజలతో పాటు ప్రయాణికులను హడలెత్తిస్తోంది. ఈ రోడ్డులో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు సరిగా వెలగడంలేదు. ఫలితంగా రాత్రివేళ వాహనాలు ప్రమాదాల బారినపడుతున్నాయి. ఈ అంధకారాన్నే అనువుగా చేసుకొని గంజాయి బ్యాచ్ సభ్యులు రెచ్చిపోతున్నారు. తమ చేష్టలతో స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

నిత్యం వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు

హైదరాబాద్ నుంచి రామవరప్పాడుకు చేరుకునే వాహనాలు గొల్లపూడి, వన్‌టౌన్, కబేళా ప్రాంతాల మీదుగా జక్కంపూడి వైఎస్సార్ కాలనీ మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు వైపు వచ్చి సింగ్‌నగర్ పైపుల రోడ్డు, పాయకాపురం, కండ్రిక నుంచి రామవరప్పాడుకు వెళ్తుంటాయి. వీటితో పాటు జక్కంపూడి, అంబాపురం, నైనవరం, కొత్తూరు తాడేపల్లి, షాబాదు పరిసర ప్రాంతాల్లోని ప్రజలు విజయవాడ నగరంలోకి రాకపోకలు సాగించేందుకు ఇన్నర్ రింగ్ రోడ్డునే వినియోగిస్తుంటారు. వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఈ రోడ్డు నిత్యం వాహనాలతో బిజీబిజీగా ఉంటుంది.



సెంట్రల్ లైట్లు వెలగకపోవడంతో అంధకారంగా ఇన్నర్‌రింగ్‌రోడ్డు



వరదల సమయంలో తవ్వి సరిగా మరమ్మతులు చేయని ఇన్నర్‌రింగ్ రోడ్డు

పట్ట పగలే కష్టం

నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో పగటి వేళల్లో రాకపోకలు సాగించడమే ఒక సాహసంగా మారింది. ఎటు నుంచి ఏ వాహనం వస్తుందో తెలికపోవడంతో ఈ రోడ్డులో ప్రయాణమంటేనే స్థానిక ప్రజలు భయపడుతున్నారు. గతేడాది వచ్చిన బుడమేరు వరదల కారణంగా అంబాపురం పంచాయతీ ప్రాంతంలో నిలిచిపోయిన వరదనీటిని మళ్లించేందుకు ఈ రోడ్డును దాదాపు పదిచోట్ల తవ్వేశారు. నీటిని మళ్లించాక రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయలేదు. రోడ్డును తవ్విన ప్రాంతాల్లో తూతూ మంత్రంగా గోతులను పూడ్చేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. ఆ గుంతలు దూరం నుంచి వాహన చోదకులకు సరిగా కనిపించడం లేదు. వేగంగా వచ్చే వాహనాలు గుంతల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఫలితంగా వాహన చోదకులు గాయాలబారిన పడుతున్నారు.

రాత్రివేళ రాకపోకలు సాహసమే..

ఇన్నర్ రింగ్‌రోడ్డులో రాత్రి సమయంలో ప్రయాణమంటే సాహసంగానే స్థానికులు భావిస్తారు. పెద్ద పెద్ద లారీలు, కారులు అతివేగంగా ప్రయాణిస్తుంటాయి. వీటి ధాటికి ద్విచక్రవాహనచోదకులు బెంబేలెత్తుతున్నారు. తమ గమ్య స్థానం చేరేవరకూ బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తుంటారు. ఇటీవల కొన్ని రోజుల నుంచి ఈ రోడ్డులో సెంట్రల్ లైట్లు సక్రమంగా వెలగడం లేదు. దీంతో అంధకారంతో కూడిన రోడ్డులో రాకపోకలు సాగించలేక పలువురు ప్రమాదాలకు గురైన ఘటనలు చోటుచేసుకున్నా యి. వీటితో పాటు గంజాయి బ్యాచ్ సభ్యులు కూడా చీకటిని అదనుగా చేసుకొని రెచ్చిపోతున్నారు. విక్రమ్ పబ్లిషర్స్ పక్కరోడ్డు పరిసర ప్రాంతాలను ఆవాసాలుగా మార్చుకొని రాత్రివేళ ఒంటరిగా రాకపోకలు సాగించే వారిని బెదిరించడం, కొట్టి డబ్బులు లాక్కోవడం వంటి ఘటనలకు పాల్పడుతున్నారు. ప్రజల ఫిర్యాదులతో పోలీసు లు ఈ ప్రాంతాలపై కొన్ని రోజులు బీట్లు వేసి తరువాత యథావిధిగా సమస్యను మర్చిపోయి తమ పనుల్లో బిజీ అయిపోయారు. మళ్లీ గంజాయి బ్యాచ్‌ల సమ స్య తీవ్రతరం అయ్యిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పెద్దలు, సంబంధిత అధికారులు ఈ ప్రాంతాలలో సెంట్రల్ లైట్లు, వీధిలైట్లు సక్రమంగా వెలిగేలా చూడాలని, గంజాయి, మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేసి తమకు రక్షణ కల్పించాలని ప్రాథేయపడుతున్నారు.

వెంకటేశ్వరరావు మాస్టారు సేవలు అభినందనీయం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్‌లోని వేలమంది విద్యార్థులను తన విద్యాబోధనతో సన్మార్గంలో నడపడంతో పాటు, ప్రధానోపాధ్యాయుడిగా ఎంకే బేగ్ హైస్కూల్ అభివృద్ధికి పరసా వెంకటేశ్వరరావు మాస్టారు చేసిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం పరసా వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ సభ పాఠశాల ఆవరణలో సోమవారం ఘనంగా జరిగింది. డీఈఓ యు.వి.సుబ్బారావు, కార్పొరేటర్ షాహినా సుల్తానా నగరంలోని పలు పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొని వెంకటేశ్వరరావు మాస్టారు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో మాస్టారును ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎంకే బేగ్ హైస్కూల్‌ను ప్రభుత్వ పెద్దలు, కార్పొరేషన్ అధికారుల సహకారంతో అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. రానున్న కొత్త ఉపాధ్యాయులు విద్యార్థులను మరింత విజయపథంలో నడిపించి పాఠశాలకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం మూడు దశాబ్దాలుగా స్కూల్ వాచ్‌మన్‌గా సేవలందిస్తున్న ఈశ్వరరావును పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

అధికారులు స్పందించారు.. గుంతలను సరిచేశారు



దుర్గాపురంలో మరమ్మతులు చేశాక రోడ్డు



సాంబమూర్తి రోడ్డు రామాలయం సమీపంలో..



దావు బుచ్చయ్యకాలనీలో..

సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎట్టకేలకు నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. వాటర్ వర్క్స్, యూజీడీ పనులలో భాగంగా తవ్విన గోతులలో సోమవారం డస్ట్‌ను పోసి రాకపోకలకు వీలుగా సరిచేశారు. నగరంలో పలు చోట్ల యూజీడీ, వాటర్ పైపులైన్ పనులు జరుగుతున్నాయి. అయితే పైపులైన్ పనులలో భాగంగా రోడ్డును తవ్వి పని చేస్తున్నారు. తవ్విన గోతులను మాత్రం సరిచేయటం లేదు. దీంతో స్థానికులు పడుతున్న అవస్థలను వివరిస్తూ 'తవ్వారు సరే.. పూడ్చేదెవరు?' శీర్షికన 'సాక్షి'లో సోమవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికారులు భావాజీపేట, దుర్గాపురం, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ తదితర ప్రాంతాల్లో గోతులను సరిచేశారు. పత్రికల్లో కథనాలు వచ్చిన ప్రాంతాల్లోనే అధికారులు మరమ్మతులు చేస్తున్నారని, అన్ని ప్రాతాల్లోనూ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి భవాని

విజయవాడలీగల్: దైనందిన జీవితంలో ఒత్తిడి బారిన పడకుండా ధ్యానం దోహదపడుతుందని పోక్సో కోర్టు జడ్జి వి.భవాని సూచించారు. బెజవాడ బార్ అసోసియేషన్ హాలులో సోమవారం వన్‌నెస్ ఎక్స్‌రియన్స్ పేరిట మెడిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి భవాని మాట్లాడుతూ.. జడ్జి విధుల్లో తాము చాలా ఒత్తిడికి గురవుతామన్నారు. ధ్యానం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని తిరిగి పొంది మనశ్శాంతితో ఎక్కువగా ప్రజలకు సేవలు అందించొచ్చని సూచించారు. బీబీఏ అధ్యక్షుడు ఎ.కె. బాషా మాట్లాడుతూ.. రోజువారీ పని ఒత్తిడితో చాలా మంది న్యాయవాదులు అనారోగ్యం పాలవుతున్నారని, ధ్యానంతో ఆరోగ్యం పొందొచ్చని పేర్కొన్నారు. బీబీఏ మాజీ అధ్యక్షుడు వేముల హాజరతయ్య గుప్తా మాట్లాడుతూ.. మనిషి జీవన ప్రక్రియలో ఎదురయ్యే ఒత్తిడులను ధ్యానం దూరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి బీబీఏ వైస్ ప్రెసిడెంట్ పిల్లా శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శి కుమారి అనురాధ, గవర్నింగ్ బాడీ సభ్యులు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు. ఆధ్యాత్మిక గురువు శ్రీప్రీతాజీ మార్గంలో ఏకం సంస్థ బోధకురాలు శ్రీఆప్తీజీ (మాధురి) ఈ మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్స్



గాంధీనగర్‌లో స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న స్విమ్మింగ్ పూల్స్‌ను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా సోమవారం ఆయన గాంధీనగర్‌లోని స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలు జరుగుతున్నందున అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్స్ నిర్వహించాలన్నారు. స్విమ్మింగ్ పూల్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, షవర్, జిమ్, మరుగుదొడ్ల నిర్వహణను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని, ఏవైనా మరమ్మతులకు గురైతే వెంటనే వాటిని బాగు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్యాలరీల అభివృద్ధికి చర్యలు స్విమ్మింగ్ పూల్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని, పూల్ ఆవరణలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు మొక్కలను పెంచాలని కమిషనర్ సూచించారు. వివిధ రకాల పోటీలు జరుగుతున్న సమయంలో ప్రేక్షకులు వీక్షించేందుకు గ్యాలరీలు అభివృద్ధి చేయాలన్నారు. మిషన్ల ద్వారా జరిగే పారిశుద్ధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రధాన రహదారులలో మెషిన్లు తరచుగా పారిశుద్ధ్య నిర్వహణ జరిపించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్న కుమార్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్‌కృష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి.వెంకట నారాయణ, డీఎఫ్ఓ మాల్యాద్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శాతవాహన కళాశాలను ప్రారంభించాలి



కళాశాల గేటు ఎదుట నినాదాలు చేస్తున్న కళాశాల పరిరక్షణ సమితి సభ్యులు, అధ్యాపకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): స్థలం వివాదం కారణంగా మూసివేసిన శాతవాహన కళాశాలను ప్రారంభించి ఈ ఏడాది విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహించాలని శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ బి.సాంబిరెడ్డి డిమాండ్ చేశారు. విశాలాంధ్ర రోడ్డులోని శాతవాహన కళాశాల గేటు ఎదుట కళాశాలను వెంటనే ప్రారంభించాలని కోరుతూ సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ స్థల వివాదం నేపథ్యంలో కళాశాలను మూసి వేయడం సరికాదన్నారు. కోర్టు తీర్పు ఉందని కళాశాల భవనాలను అర్ధరాత్రి వేళ కూల్చివేశారని, స్థలానికి సంబంధించి కోర్టు తీర్పు ఎవ్వరికి అనుకూలంగా వచ్చినా తమకు సంబంధం లేదని చెప్పారు. 54 సంవత్సరాల చరిత్ర ఉన్న కళాశాలను నిర్వహించాలని మాత్రమే తాము కోరుతున్నామన్నారు. స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని అయినా కళాశాలను నిర్వహించాలని కోరారు.

కళాశాల భవనాలను కూల్చడం తగదు..

కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ.. కళాశాలను ప్రారంభించాలని కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబును కలిసి వినతిపత్రాలు అందజేశామన్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కోర్టు తీర్పుల పేరుతో అర్ధరాత్రి వేళ కళాశాల భవనాలను కూల్చివేయడం తగదన్నారు. కళాశాలను వెంటనే ప్రారంభించాలంటూ నినాదాలు చేశారు. కళాశాల సిబ్బంది సంజీవరావు, బ్రహ్మయ్య, సత్యనారాయణ, యశోద, శాతవాహన కళాశాల పరిరక్షణ కమిటీ కో-కన్వీనర్లు డి.విష్ణువర్ధన్, ఎం.అరుణ్‌కుమార్, సభ్యులు వాలేశ్వరరావు, వల్లూరు నాగబాబు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అందించే ఇళ్లను త్వరితగతిన నిర్మించండి



హౌసింగ్ వివరాలు తెలుసుకుంటున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): పేదలకు అందించే ఇళ్లను త్వరితగతిన నిర్మించాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం ఆదేశించారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనం మీటింగ్ హాల్‌లో కాంట్రాక్టర్లు, లబ్ధిదారులు, హౌసింగ్, వీఎంసీ అధికారులతో సోమవారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లందరూ సహకరించాలని, త్వరితగతిన ఇళ్లన్నీ పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లు, అధికారుల మధ్య సమన్వయ లోపంలో ఉన్న అంశాలను ముఖాముఖి చర్చించడంతో సమస్యలను పరిష్కరించారు. ప్రభుత్వం నుంచి వారికి సంపూర్ణ సహాయం అందుతుందని ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు. వీఎంసీ చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్(వర్క్స్) పి.సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ) విభాగం పి.వెంకటనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, హౌసింగ్ పీడీ రజిని కుమారి, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో అత్యాధునిక మైక్రో వాస్క్యులర్ సర్జరీలు



డాక్టర్ ఇర్రింకి సురేష్

లబ్బీపేట(విజయవాడ తూర్పు): డోర్నకల్ రోడ్డులోని లైఫ్‌లైన్ త్రిమూర్తి హాస్పిటల్‌లో అత్యాధునిక మైక్రో వాస్క్యులర్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు ఆర్థోపెడిక్, మైక్రోవాస్క్యులర్ అండ్ హ్యాండ్ సర్జన్ డాక్టర్ ఇర్రింకి సురేష్ తెలిపారు. అందుకోసం అమెరికాకు చెందిన అత్యాధునిక మైక్రోస్కోప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఈ మైక్రో స్కోప్ సాయంతో చేతులు, కాళ్ల వంటి అంగాల్లో జరిగిన తీవ్రమైన గాయాలు, నాడీ సంబంధిత సమస్యలు, రక్తనాళాల చికిత్సలు అత్యంత సమర్థంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. చేతులు, కాళ్ల డెలికేట్ శస్త్రచికిత్సలు తక్కువ ఇన్వేసివ్ పద్ధతుల్లో నిర్వహించవచ్చన్నారు. మైక్రో నాడీ, రక్తనాళాల శస్త్రచికిత్సలు భద్రంగా చేయవచ్చని, ప్రమాదాల అనంతరం వచ్చిన డ్యామేజ్‌ను పునరుద్ధరించొచ్చని తెలిపారు. హ్యాండ్ ఫ్లాప్ సర్జరీ, ట్రామా తర్వాత లింబ్ రికన్‌స్ట్రక్షన్, కాంప్లెక్స్ మల్టిపుల్ ఇంజురీల సర్జరీ నాడీ సమస్యల శస్త్ర చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో మొదటి మైక్రో వాస్కులర్ కేంద్రంగా సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం అనధికార విక్రయాలు అరికట్టాలని వినతి



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైన్ షాపుల వద్ద బహిరంగంగా మద్యం తాగడం, బార్‌లలో అనధికార విక్రయాలను అరికట్టాలని కోరుతూ ఏఐవైఎఫ్ ప్రతినిధులు సోమవారం మారుతీనగర్‌లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి లంక గోవిందరాజులు మాట్లాడుతూ.. నగరంలో అసాంఘిక కార్యకలాపాలు పెరిగడానికి ప్రధాన కారణం మద్యం అని అన్నారు. నగరంలోని దాదాపు అన్ని బార్‌లలో ఉదయం ఐదు నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్యం విక్రయాలు సాగుతున్నాయన్నారు. ప్రతి వైన్ షాప్ వద్ద బహిరంగంగానే మందుబాబులు మద్యం తాగుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి వైన్‌షాపులు, బార్‌లపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. ఏఐవైఎఫ్ జాతీయ సమితి సభ్యురాలు గంటా మమత, నాయకులు లంకే సాయి, సింగంశెట్టి మోహన్ ప్రసాద్, షైనీ, పి.నరేష్, డి.స్వప్న పాల్గొన్నారు.

జెట్ సిటీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి, వేమవరం గ్రామాల్లో చేపట్టిన జక్కంపూడి ఎకనామిక్ టౌన్ షిప్ (జెట్ సిటీ) పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జెట్ సిటీ పనుల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ వేమవరంలో జక్కంపూడి ఎకనామిక్ టౌన్ షిప్ (జెట్ సిటీ) ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మునిసిపల్, రెవెన్యూ, ఏపీఐఐసీ, ఏపీ ఎడ్కో సమన్వయంతో సదరు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, విజయవాడ ఆర్డీఓ, మునిసిపల్ కార్పొరేషన్ సిటీ ప్లానర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, చీఫ్ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్), విజయవాడ రూరల్ తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కులాలకు సామాజిక న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ, రవికుమార్ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర జనాభాలో ఆరు శాతానికి పైగా ఉన్న చేనేత కులాలకు సామాజిక న్యాయం చేయాలని అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని బ్రాంచి కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన చేనేత కులాలను ప్రభుత్వం తగిన ప్రోత్సాహం ఇచ్చి ఆదుకోవాలన్నారు. పద్మశాలి కార్పొరేషన్‌కు తగినన్ని నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తప్పనిసరిగా వారానికోసారి చేనేత వస్త్రాలు ధరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత కులాలకు ప్రభుత్వం నామినేటెడ్ పదవులు కేటాయించాలని, శాసన మండలి, రాజ్యసభలకు ఎంపిక చేయాలని కోరారు. అమరావతి, సింహాచలం దేవస్థానాల్లో పద్మశాలి అన్నసత్రాలకు స్థలం కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కలిమిశ్రీ, చొప్పా రాఘవేంద్రశేఖర్ పాల్గొన్నారు.